నవరత్నాలతో నవశకం

రూ. 9 లక్షల లబ్ధి చేకూరింది



నాపేరు హసీనా. రహమత్‌పురం 16వ వార్డు. మాకు ఇదివరలో ఎన్నడూ లేని విధంగా రూ.9 లక్షల వరకూ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరింది. వైఎస్సార్ అమ్మ ఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ చేయూత పథకాలు అందాయి. ఇంటి పట్టాతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. అన్ని పథకాలు ఎలాంటి సిఫార్సులు లేకుండా అందాయి. జగనన్న పాలన చాలా సంతృప్తినిస్తోంది.

- ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్
- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



హనుమంతనపల్లిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నల పథకాలతో రాష్ట్రంలో నవశకం నడుస్తోందని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్ 16వ వార్డులో ఎమ్మెల్సీ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుళ, చైర్‌పర్సన్ ఇంద్రజ, వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జుగ్ను, మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాలతో అందిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చాలామంది మహిళలు ఎలాంటి సిఫార్సులు, ఇబ్బందులు పడకుండా తమకు లబ్ధి నేరుగా ఇంటికే వచ్చి చేరుతోందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వస్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమానికి బీజేపీ, ఎంఐఎం పార్టీ కౌన్సిలర్లు కూడా హాజరవుతున్నారని, ఇంతకంటే నిదర్శనం మరోటి లేదన్నారు. నీటి సమస్య పరిష్కారానికి త్వరలో పైప్‌లైన్ మార్చడానికి మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. 'ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన ఎమ్మెల్యే బాలకృష్ణకు హిందూపురమంటే గుర్తురాదు. ఇక్కడికి రావడానికి తీరిక లేదు. సినిమాలు తప్ప ఆయనకు ప్రజా సంక్షేమం, అభివృద్ధి అవసరం లేదు' అని విమర్శించారు. సినిమా వారి మాటలు నమ్మరాదని, స్థానికంగా ఉంటూ ప్రజల మధ్యకు వచ్చే వారిని ఆదరించాలని కోరారు.

రూ.20 లక్షలతో రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం..

మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ రహమత్‌పురం వీధులను కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికీ అధికార బృందంతో వచ్చి కష్టసుఖాలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారంటే ఎవరిది బాధ్యతాయుత పాలనో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. 16వ వార్డును ఆదర్శవార్డుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. రూ.20 లక్షలతో రోడ్డు, డ్రైనేజీ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబివుల్లా కౌన్సిలర్లు మల్లికార్జున, నాగేంద్రమ్మ, ఎంఐఎం ఆదిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి గడపలో సంతోషం

అమరాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి గడపలోను ఆనందం నెలకొందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం బసవనపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని హనుమంతనపల్లి ఎస్సీ, బీసీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే స్థానికంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే తిప్పేస్వామికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చి ప్రతి గడపలోనూ సంతోషం నింపారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలు, మహిళలు, రైతులు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసి వారిని సంతోషంగా ఉండేలా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసిన ఏకైక సీఎం జగనన్న అన్నారు. ఎక్కడా అవినీతి అన్న పదానికి తావు లేకుండా చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కొంతమంది ఇళ్లు, పింఛన్లు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు అర్హత ఉన్న వారికి మంజూరు చేసేలా ఆదేశాలు ఇచ్చారు. అలాగే సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్లు రాజేశ్వరి, లక్ష్మీదేవి, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ భాగ్యమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, రాజేశ్వరి, లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు దివాకర్, నరసింహప్ప, రమేష్, బాషాసాబ్, నారాయణప్ప, చిక్కన్న, శివకుమార్, ఎంపీడీఓ మునిస్వామి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బెస్ట్ యూనివర్సిటీకి భూ పరిశీలన



భూమి వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ చేతన్

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లి సమీపంలో ఏర్పాటైన బెస్ట్ యూనివర్సిటీకి అదనపు భూమి కేటాయింపుల కోసం బుధవారం జాయింట్ కలెక్టర్ చేతన్, పుట్టపర్తి ఆర్‌డీఓ భాగ్యరేఖ ప్రభుత్వ భూములను పరిశీలించారు. బెస్టు యూనివర్సిటీ యాజమాన్యం లీజ్ పద్ధతిలో 60 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే యూనివర్సిటీ సమీపంలో 28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రెవిన్యూ అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో జాయింట్ కలెక్టర్ అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, సర్వేయర్ తాతయ్య పాల్గొన్నారు.

వేరుశనగలో సస్యరక్షణ పాటించాలి



శంకరగల్లులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ తిమ్మప్ప

గుడిబండ: వేరుశనగ, రాగి పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ తిమ్మప్ప సూచించారు. బుధవారం ఆయన మండలంలోని శంకరగల్లు, రాళ్లపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో మండల వ్యాప్తంగా సాగుచేసిన వేరుశనగ, రాగి పంటలకు పేను బంక ఆశించిందన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ దాని ఉధృతి ఇంకా పెరుగుతుందన్నారు. నివారణకు రైతులు డైమిథోయేట్ 400 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ అనే మందును ఎకరానికి 60 ఎంఎల్ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుశనగ పైరులో అక్షింతల పురుగులు అనే మిత్ర పురుగు పేనుబంకని తినేస్తుంది. కాబట్టి క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించాలన్నారు.

రెగ్యులర్ పీఆర్ ఏఈని నియమించాలి



ఎంపీడీఓకు సమస్యను వివరిస్తున్న సర్పంచ్ ప్రకాష్

రొళ్ల: మండలానికి రెగ్యులర్ పంచాయతీ రాజ్ ఏఈని నియమించాలని సభ్యులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. పీఆర్ ఏఈతో పాటు ఇతర అధికారులను రెగ్యులర్‌గా నియమించాలని సమావేశం నుంచి వాకౌట్ చేశారు. తర్వాత కొద్ది సమయం తర్వాత ఎంపీడీఓ రామారావు జోక్యం చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నామని తెలియజేశారు. అనంతరం ఆయా శాఖల పరిధిలో జరిగే అభివృద్ధి పనులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంఈఓ శ్రీధర్, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఓ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సేవలందిస్తున్న మిమిక్రీ కళాకారుడు



విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పిస్తున్న నవీన్

పావగడ: తాలూకాలోని కిలార్లహళ్లి గ్రామానికి చెందిన మిమిక్రీ కళాకారుడు నవీన్ కిలార్లహళ్లి పది, పీయూ విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టి పరీక్షలను ఎదురించే ధైర్యాన్ని నింపడానికి పలు పాఠశాలలు, కళాశాలలు పర్యటించి తన వంతుగా ఉచితంగా అవగాహన తరగతులను నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా వైఎన్ హొసకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాడు. విద్యార్థులు ఇతర వ్యామోహాలపై దృష్టి పెట్టకుండా జ్ఞాపకశక్తిని పెంపొందించు కోవాలన్నారు. పది పరీక్షలు దగ్గర పడు తుండడంతో శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఇదిలా ఉండగా అతను ఇది వరకు 150 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాడు. విద్యార్థులను ఆకట్టుకునేలా హాస్య కథలు, పాటలు, మిమిక్రీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నాడు.

చిత్రలేఖన పోటీల్లో సత్తా



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో స్థానిక పాంచజన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా వారిని బుధవారం స్థానిక పాఠశాలలో పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు. 4వ తరగతి విద్యార్థి అయాన్ మొదటి బహుమతి, 3వ తరగతి విద్యార్థిని హిమాక్షిత మొదటి బహుమతి, 5వ తరగతి విద్యార్థిని నిహారిక ద్వితీయ బహుమతి, ఆఫిఫా తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. అలాగే బాలికల విభాగంలో 7వ తరగతి విద్యార్థిని నమ్రతా మొదటి బహుమతి, 6వ తరగతి విద్యార్థిని సుష్మిత ద్వితీయ బహుమతి, షబ్రీన్ తాజ్ తృతీయ బహుమతి సాధించగా, 8 నుంచి 10వ తరగతి బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని మేఘన ద్వితీయ బహుమతి, అబ్రీన్ బాను తృతీయ బహుమతి సాధించారన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

చిలమత్తూరు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ డీపీఎం శ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న దివ్యాంగుల సమర్థనం ట్రస్ట్‌లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా అర్హత కలిగిన దివ్యాంగులు శిక్షణ తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులకు అవగాహన కల్పించాలని కింది స్థాయి ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో సమర్థనం ట్రస్ట్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, శ్రీనిధి మేనేజర్ పద్మావతి, ఏపీఎం భారతి తదితరులు పాల్గొన్నారు.


డ్రిప్ పరికరాల దగ్ధం

పావగడ: కొంత మంది ఆకతాయిలు పెట్టిన నిప్పుకు మంటలు చెలరేగి డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. వివరాలు.. తాలూకా లోని బొమ్మతనహళ్లికి చెందిన రైతు నాగరాజు 6 ఎకరాల పొలంలో వేరుశనగ, కాయ గూరల సాగుకు డ్రిప్‌ను ఏర్పాటు చేశాడు. బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఆకతాయిలు ఎండు గడ్డి కి నిప్పు పెట్టడంతో డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

సోమందేపల్లి: రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. అఖిల భారత మహాసభల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకంలో రూ.600లు రోజుకు కూలి ఇవ్వాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజ్‌గోపాల్, జిల్లా కమిటీ సభ్యుడు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ



మైదానంలో పనులు చేయిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మండలంలోని అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో లాంగ్ జంప్ పిట్, రన్నింగ్ కోసం మైదానంలో చదును పనులు చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జగన్ నాయక్, నగేష్, రంగనాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని చిన్నమంతూరులో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పలు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టం, గృహహింస, వేధింపులు, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై మహిళలకు వివరించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మట్లాడుతూ.. ప్రతి మహిళ తమకున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సేవా సలహాల మండలి నుంచి మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు, గృహహింస జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ న్యాయ సలహాల కేంద్రం కమిటీ సభ్యులు, మహాశక్తి ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, అనంతశక్తి సొసైటీ సిబ్బంది శారద పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో చిరుధాన్యాల కొనుగోలు

అమరాపురం: మండలంలోని రైతులు పండించిన చిరుధాన్యాలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నారాయణనాయక్ పేర్కొన్నారు. బుధవారం కె.శివరంలోని ఆర్బీకేలో రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఎక్కడైతే రైతులు పంట సాగు చేశారో అక్కడే కొనుగోలు చేస్తామన్నారు. ఏడీఏ కృష్ణమీనన్, తహసీల్దార్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ.మంజునాథ, ఏఈఓ అమర్నథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

మడకశిరరూరల్: మండలంలో పనులకు అవసరమయ్యే భూములను వేగవంతంగా సేకరించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలోని తుముకూరు నుంచి రాయదుర్గానికి ఏర్పాటు చేస్తున్న రైల్వే లైన్, హైవే నిర్మాణానికి తర్వతిగతిన భూ సేకరణ చేయాలన్నారు. కర్ణాటక నుంచి పావగడకు ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్‌తో మండలంలో గోవిందాపురం నుంచి గుర్రపుకొండ వరకు ఎంత మంది రైతులు నష్టపోతున్నారో వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిర(అగళి): నరసంబూది గ్రామంలో గురువారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర, జగనన్న సచివాలయం కన్వీనర్ శివన్న తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఫ్యాన్ల వితరణ



కమిటీ సభ్యులకు ఫ్యాన్లు వితరణ చేస్తున్న దాతలు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రానికి పలువురు దాతలు 8 ఫ్యాన్లను బుధవారం వితరణగా అందజేశారు. పర్యాటక కేంద్రమైన లేపాక్షిని సందర్శించడానికి విచ్చేసే పర్యాటకుల కోసం ఫ్యాన్లు వితరణ చేశామని దాతలు హిందూపురానికి చెందిన లైఫ్ వరల్డ్ ట్రస్ట్ సభ్యులు ఉదయకుమార్, నక్కలపల్లికి చెందిన శ్రీరామిరెడ్డి, మనోజ్ జూలియాట్, రామాంజినేయులు గురూజీ, గోరంట్ల నిస్సార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆదినారాయణ, టైలర్ గంగాధర్, శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు

మడకశిరరూరల్: నీలకంఠాపురంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రంలో టెక్నీషియన్, ఏఎన్‌ఎం, గ్రామ కోఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు వసతితోపాటు ఏడాది పాటు శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ సమయంలో నెలకు రూ.1000 చొప్పున పారితోషకం ఇస్తామన్నారు.

గుంతల పూడ్చివేత



గుంతలపై కంకర వేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్‌కు వెళ్లే ప్రధాన రహదారి చెరువు కట్ట కింద నీటి ఊట కారణంగా ఏర్పడిన గుంతలకు సర్పంచ్ సంధ్య కంకర వేయించారు. నాలుగు నెలల నుంచి నీటి ఊట కారణంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. బుధవారం సర్పంచ్ సిబ్బందితో కంకర వేయిండంతో వాహనదారులకు ఉపశమనం కలిగింది.

విరాళం అందజేత

సోమందేపల్లి: మండల కేంద్రంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ఏర్పాటుకు నాగినాయని చెరువు సర్పంచ్ అంజినాయక్ బుధవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నరసింహ మూర్తి, బాబు, గంగాధర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందజేత

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ శ్రీరామప్ప ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి నూనె, సోపులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ నారాయణ పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యలకు పరిష్కారం

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీ పరిధిలో ఖాళీ స్థలాలు, భవనాలపై జరుగుతున్న రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కరం లభిస్తుందని కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మున్సిపల్ ఆఫీసులో పట్టణ సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే చేసి కంప్యూటర్‌లో కచ్చితమైన వివరాలు నమోదు చేస్తామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఎలాంటి సమస్యలకు తావుండదన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు డాక్టర్ వెంకటచిరంజీవి వైద్య పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఏదైనా వ్యాధి సోకినపుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఐచర్ వాహనం గోతిలోకి దూసుకుపోయింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బత్తలపల్లి పోలీసుల సమాచారం మేరకు..తమిళనాడు నుంచి గుత్తికి టెంకాయలను తీసుకెళ్తున్న ఐచర్, బత్తలపల్లికి చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులో తూలాడు. వాహనం అదుపుతప్పి డివైడర్లను ఢీ కొంది. జాతీయ రహదారిపై ఎడమ వైపు వస్తున్న ఐచర్, అదుపుతప్పి కుడి వైపుకు వెళ్లి గోతిలోకి దూసుకుపోయింది.

వైబీహళ్లి పెద్ద చెరువు వేలం

మడకశిరరూరల్: వైబీహళ్లి పెద్ద చెరువులో చేపల పెంపకానికి బుధవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ రామాంజనేయులు, ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి రూ.3.60 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు వారు తెలిపారు. పంచాయితీలోని చింతచెట్ల వేలంను రూ.14 వేలకు వ్యాపారస్తుడు హనుమంతరాయప్ప దక్కించుకున్నాడన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ పాలక వర్గం సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జీవీపాళ్యం చెరువు వేలం పాట..

జీవీపాళ్యం పంచాయతీలోని చెరువులో చేపల పెంపకానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కళావతి, ఈఓఆర్డీ శైలజ సమంక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ఈరలింగప్ప తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చని సూచించారు.

కేఆర్‌పీపీలోకి జోరుగా చేరికలు



కేఆర్‌పీపీలోకి చేరిన నాయకులు

పావగడ: గాలి జనార్దనరెడ్డి స్థాపించిన కళ్యాణ రాజ్య ప్రజా పార్టీలోకి ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు భారీగా చేరుతున్నారు. ఇందులో భాగంగా తాలూకా లోని బీకే హళ్లి, వద్రేవు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్, జేడీఎస్ నాయకులు కార్యకర్తలు కేఆర్‌పీపీలోకి బుధవారం చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహుడు నేరళెకుంటె నాగేంద్ర కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించాడు. నాయకులు చెన్నకేశవ రెడ్డి, ఎస్ హనుమంతరాయప్ప, కరియణ్ణ, అంజినరెడ్డి, నాగరాజు ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేబ్యాంక్ హోమ్ లోన్ ఫైనాన్స్ లిమిటెడ్ నిధులు మంజూరు చేసింది. ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తాగునీటికి ఇబ్బంది పడుతుండటంతో స్థానికులు ఈ విషయాన్ని సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డికి తెలిపారు. ప్రతాప రెడ్డ వెంటనే సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ దృష్టికి సమస్యను వివరించారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేబ్యాంక్ హోమ్ లోన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ స్థలం కోసం రగడ

రొద్దం: మండల పరిధిలోని బీదానిపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం కోసం బుధవారం ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం చేపట్టాలని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్పందనలో అధికారులకు విన్నవించారు. ఈ విషయంపై వీఆర్‌ఓ, సర్వేయర్ గ్రామంలో స్థలం పరిశీలించడానికి వెళ్లగా సర్పంచ్ వర్గం, మరో వర్గం స్థలం విషయంలో గొడువపడ్డారని ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు. అయితే సర్పంచ్ మంజు అడ్డుపడుతున్నట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే గ్రామంలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా సంత్ రవిరాజ్ జయంతి

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బీజేపీ నాయకులు సంత్ రవిరాజ్ మహారాజ్ జయంతిని జరుపుకున్నారు. జిల్లా ఎస్సీ సెల్ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ నేతృత్వంలో సంత్ రవిరాజ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫైనాన్స్ కమిటీ అధ్యక్షుడు రామాంజినేయులు, సూర్యనారాయణ, హనుమంతు, సుభాష్ మధుసూదన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంధం వేడుకలు



గంధం తీసుకెళ్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని హజ్రత్ సయ్యద్‌షా బాబా బాబా మొయినుద్దీన్ జమాలే హుస్సేని షేహర్‌వర్ది దర్గాలో బుధవారం తెల్లవారుజామున గంధం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గా నిర్వాహకులు సయ్యద్‌షా బాబా ఇబ్రహీం హుస్సేని, సయ్యద్ బాబా అంజాద్ హుస్సేనీ తమ స్వగృహం నుంచి గంధం తీసుకెళ్లి, స్వామికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. గురువారం ఉరుసు జరుగుతుందని తెలిపారు.